ప్రజాశక్తి

బుధవారం 11 అక్టోబర్ 2023 5 శ్రీ సత్యసాయి

జగన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పౌరహక్కుల కోసం ఐక్యంగా ఉద్యమిద్దాం

◆ఎన్ఐఏ దాడులు సరికాదు ◆అబ్దుల్ రసూల్, చంద్రశేఖర్‌కు పౌర సంఘాల సంఘీభావం ◆రాజ్యాంగ పరిరక్షణ వేదిక రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్

అబ్దుల్ రసూల్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మేధావులు, రచయితలు, జర్నలిస్టులపై కేంద్ర నిఘా సంస్థ జరుపుతున్న దాడులను అనంతపురం జిల్లాలోని పౌర సంఘాల నాయకులు ఖండించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. జిల్లాలో అబ్దుల్ రసూల్, చంద్రశేఖర్‌లపై జరిపిన దాడిని ఖండిస్తూ వారికి అండగా నిలుస్తామని సంఘీభావం తెలిపారు. అనంతపురం నగరంలోని ఎన్జీవో హోంలో రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసి, ఎస్‌యుసిఐసి, వైసిపి, టిడిపి, కాంగ్రెస్ పార్టీల నాయకులతోపాటు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. జిల్లాలో అబ్దుల్ రసూల్, చంద్రశేఖర్ నాయకుల ఇళ్లలో ఎన్ఐఎ దాడులు చేయడాన్ని అందరూ సంయుక్తంగా ఖండించారు. ఇద్దరు నాయకులు కూడా ప్రజాస్వామ్యయుతంగా ప్రజల తరుపున నిలబడే నాయకులేనని చెప్పారు. మానవ హక్కుల కోసం నిలబడి నాయకులను లక్ష్యంగా చేసుకుని ఎన్ఐఎ దాడులు చేయడం సహించరానిదని ఖండించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోనున్న బిజెపి ఒక పథకం ప్రకారమే మేధావులు, రచయితలు, ప్రజాస్వామికవాదుల ఇళ్లపై ఇటువంటి దాడులు చేస్తోందని విమర్శించారు. గాంధీ జయంతి రోజున దేశ వ్యాప్తంగా 200కుపైగా ప్రాంతాల్లో సోదాలు నిర్వహించిందన్నారు. ఇది ప్రజాస్వామిక గొంతుకల నొక్కే ప్రయత్నంలో భాగమేనని చెప్పారు. ఇటువంటి వాటికి వ్యతిరేకంగా ప్రజాస్వామిక వాదులందరూ నినదించాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వైఖరి నియంత్రుత్వంగా ఉందని చెప్పారు. అబ్దుల్ రసూల్, చంద్రశేఖర్‌లు ఇద్దరూ ప్రజాస్వామిక హక్కుల కోసం మాట్లాడేవారు తప్ప రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉండేవారు కాదని అన్నారు. అటువంటి వారిని కూడా ఈ ప్రభుత్వం ఉపేక్షించే పరిస్థితుల్లో లేకపోవడం శోచనీయమన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణ స్వామి మాట్లాడుతూ దేశంలో ప్రశ్నించే గొంతుకలను నొక్కే ప్రయత్నంలో భాగమే కేంద్రం ఇటువంటి చర్యలకు పాల్పడుతోందన్నారు. దీనికి వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ముందు నుంచి పాలకులు ప్రశ్నించే గొంతకలను అణచివేస్తూ వస్తున్నాయన్నారు. గతంలో ఎమర్జెన్సీ పేరుతోనూ ఇటువంటి ప్రయత్నాలే జరిగాయని గుర్తుచేశారు. సిపిఎం రాష్ట్ర నాయకులు జి.ఓబుళు మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ మతోన్మాద విధానాలను బిజెపి అమలు చేస్తోందని విమర్శించారు. అందులో భాగంగానే వారి విధానాలను ప్రశ్నించే పౌర హక్కులు, ప్రజాస్వామిక వాదుల ఇళ్లపై దాడులు చేసి గొంతులు నొక్కే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. సమిష్టిగా దీన్ని తిప్పికొట్టాల్సిన అవసరముందన్నారు. ఎస్‌యుఎస్ఐ జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బిజెపి ఈ రకమైన దాడులకు పాల్పడుతూ భయోత్పాతాన్ని ప్రశ్నించే వారిలో సృష్టించే ప్రయత్నం చేస్తోందన్నారు. కాంగ్రెస్ నాయకులు దాదా గాంధీ మాట్లాడుతూ ప్రజాస్వామిక వాదులపై జరుగుతున్న దాడులను ఖండించారు. దీనికి వ్యతిరేకంగా కాంగ్రెసు పార్టీ నిలబడుతుందని చెప్పారు. వైసిపి నాయకులు ఎకెఎస్ ఫయాజ్ బాషా మాట్లాడుతూ అబ్దుల్ రసూల్, చంద్రశేఖర్‌లపై జరిగిన దాడిని ఖండించారు. వారికి మద్దతుగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నుంచి నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఎన్ఐఎ దాడులను ఖండిస్తూ తీర్మానం చేశారు. అదే విధంగా అబ్దుల్ రసూల్, చంద్రశేఖర్‌లకు సంఘీభావాన్ని తెలుపుతూ తీర్మానం చేశారు.

ప్రజాస్వామికవాదులుగానే ఉంటాం : చంద్రశేఖర్

ప్రశ్నించే గొంతుకలను నొక్కే ప్రయత్నంగానే ఎన్ఐఎ దాడులను చూస్తానని చంద్రశేఖర్ చెప్పారు. తమ ఇంట్లో సోదాలు నిర్వహించి తీసుకెళ్లి పుస్తకాలు చూస్తే ఎవరికైనా నవ్వు వస్తుందన్నారు. వారు పట్టుకెళ్లిన పుస్తకాలేమిటంటే జిల్లాలోని కమ్యూనిస్టు నాయకులైన ఐదుకల్లు సదాశివన్, నీలం రాజశేఖర్ జీవిత చరిత్రలకు సంబంధించిన పుస్తకాలని చెప్పారు. అవి బహిరంగంగా అన్ని చోట్లా లభించే పుస్తకాలేనని చెప్పారు. నిషేధిత పుస్తకాలేవి తమ వద్దలేవని అన్నారు. దశబ్దాలుగా ఇక్కడ ప్రజలతో కలసి అనేక సమస్యలపై పోరాటం సాగించామని తెలిపారు. తామేదేది రాజ్యాంగ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడలేదని, ఇది విషయం జిల్లా వాసులందరికీ తెలిసిందేనని వివరించారు.

సంఘీభావానికి ధన్యవాదాలు
అబ్దుల్ రసూల్

ఎన్ఐఎ అధికారులు తమ ఇంట్లో సోదాలు నిర్వహిస్తే ఏ ఒక్క వస్తువు లభించలేదని అబ్దుల్ రసూల్ తెలిపారు. చివరకు మొబైల్‌ఫోన్ సీజ్ చేసుకుని వెళ్లారని తెలిపారు. ప్రజల తరుపు, వారి సమస్యలపై గళం విప్పడాన్ని ప్రభుత్వం సహించడం లేదని అన్నారు. అయితే ఈ సందర్భంగా జిల్లావాసులు నుంచి పెద్దఎత్తున సంఘీభావం తెలిపినందుకు ధన్యవాదాలు తెలిపారు.

ప్రజలకు ఉపయోగపడేలా

జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు

కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-కొత్తచెరువు

ప్రజలందరికీ ఉపయోగపడేలా ప్రభుత్వ జగన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను అన్ని గ్రామాల్లోనూ నిర్వహిస్తోందని, దీనిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. కొత్తచెరువు మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను కలెక్టర్ తనిఖీ చేశారు. అక్కడికొచ్చిన ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఏడు రకాల పరీక్షలను నిర్వహించి, హెల్త్ ప్రొఫైల్‌లో వారి వివరాలను నమోదు చేయాలని, అవసరమైన వారికి కేస్ షీట్లను అందించాలని వైద్యులకు సూచించారు. శిబిరాల్లో ఇసిజితో సహా మొత్తం 14 రకాల పరీక్షలను నిర్వహించి, 105 రకాల మందులను ఉచితంగా ఇవ్వాలని తెలిపారు. కంటి పరీక్షలను కూడా నిర్వహించి, అవసరమైనవారికి ఉచితంగా కళ్లద్దాలను అందజేయాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా మరింత ఆరోగ్య సేవలు గ్రామస్థాయిలో ప్రతి ఒక్కరికీ అందాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ కృష్ణారెడ్డి, తహశీల్దార్ రామాంజనేయులు రెడ్డి, ఈఒఆర్‌డి సిద్ధారెడ్డి, సర్పంచి రాధా నాగరాజు, డాక్టర్లు మమత భవాని, అశ్వత్ కుమార్ పాల్గొన్నారు.

16న ఈవీఎంల పరిశీలన

రాజకీయ పార్టీలు పాల్గొనాలి : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఈనెల 16 తేదీన ధర్మవరం వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఉదయం 9 గంటలకు ఈవీఎంల మొదటి దశ పరిశీలన (ఎఫ్‌ఎల్‌సి) కార్యక్రమం ఉంటుందని, ఇందులో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొనాలని కలెక్టర్ పి.అరుణ బాబు కోరారు. మంగళవారం నాడు కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో డిఆర్ఒ కొండయ్యతో కలిసి వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఎల్‌సి ప్రక్రియ విధానంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎఫ్‌ఎల్‌సి కార్యక్రమం నిర్వహించే సమయంలో రాజకీయ పార్టీల భాగస్వామ్యం ఎంతో కీలకం అన్నారు. ఈవీఎంల ఎఫ్‌ఎల్ సి తర్వాత రాండమైజేషన్ చేస్తామని, వాటి భద్రత అంశంలో ఎన్నికల కమిషన్ సూచించిన మార్గదర్శకాల మేరకు రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో మాక్ పోల్ కూడా నిర్వహిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ మైనావుద్దీన్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కూలీలు కాదు విద్యార్థులు..!

పిల్లలచేత కుర్చీలు మోయించిన సచివాలయ సిబ్బంది

రిక్షాలో కూర్చీలను తీసుకెళ్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-మడకశిర

పాఠశాలకు వెళ్లే విద్యార్థులతో సచివాలయ సిబ్బంది కూర్చీలను మోయించారు. పిల్లలు ఈ పనులు చేస్తుండడాన్ని చూసినా సిబ్బంది స్పందించకుండా వారితో ఈ పనులు చేయించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మంగళవారం ఉదయం మడకశిర మండల పరిధిలోని చత్రం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లలో భాగంగా సచివాలయంలోని కుర్చీలను సురక్ష కార్యక్రమం వద్దకు తీసుకొచ్చారు. కార్యక్రమం అనంతరం వాటిని కార్యాలయంలోకి చేర్చేందుకు సచివాలయ సిబ్బంది ఆ గ్రామానికి చెందిన విద్యార్థులను వాడుకున్నారు. చిన్నారులు రిక్షాలో కూర్చీలను తీసుకెళ్లి సచివాలయంలో అందజేశారు. చిన్నారులతో ఈ పనులు చేయించిన సచివాలయ సిబ్బందిపై వెంటనే ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

తేనెటీగల పెంపకం లాభదాయకం

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

తేనెటీగల పెంపకం లాభదాయకమే కాకుండా సమాజానికి శ్రేయస్సుకరమని గ్రామీణ అగ్రికల్చరల్ డెవలప్మెంట్ రాడ్స్ అధ్యక్షులు బండ్లపల్లి మదన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. రాడ్స్‌ఆధ్వర్యంలో పుట్టపర్తి ప్రాంతంలో తేనెటీగల పెంపకంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేనెటీగల పెంపకం వ్యవసాయంలో ముఖ్యపాత్ర పోషిస్తోందని, ఈ విషయంలో రైతులు తగిన శ్రద్ధ వహించి తేనెటీగల పెంపకంపై దృష్టి పెట్టాలని కోరారు. ఇందుకు తమ వంతు సహకారంగా తగిన శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇదే సందర్భంలో ప్రభుత్వం కూడా తేనెటీగల పెంపకంపై రైతులకు తగిన సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. తేనెటీగల పెంపకం వలన బహుళ ప్రయోజనాలు ఉన్నాయని విషయాన్ని కూడా రైతులు గుర్తుంచుకోవాలని అన్నారు. ప్రధానంగా పూల తోటలు, పండ్లతోటలు అన్నీ కూడా తేనెటీగల పైనే ఆధారపడి ఉన్నాయనే విషయాన్ని అందరికీ తెలియజేయాలన్నారు. రైతులు పండించే ఏ పంటకైనా దిగుబడులు ఆశించిన స్థాయిలో ఉండాలంటే తేనెటీగల ప్రాధాన్యత ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సైంటిస్ట్ శ్రీనాథ్ రెడ్డి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో 'కిల' పరిశీలన

◆గ్రామ పంచాయతీల నిర్వహణలో కేరళ టాప్ ◆ఏపీలో ఐఎస్ఒ గుర్తింపునకు 'పంచాయతీలు' ఇంకా మెరుగవ్వాలి

సమావేశంలో మాట్లాడుతున్న కిలా సంస్థ జిల్లా కోఆర్డినేటర్ సోనియా

చిలమత్తూరులో రిసెప్షన్ కౌంటర్ ఏర్పాటు చేసిన అధికారులు

ప్రజాశక్తి-చిలమత్తూరు

ఐఎస్ఒ సర్టిఫికెట్ ఎంపిక కోసం శ్రీ సత్యసాయి జిల్లాలోని చిలమత్తూరు, గోరంట్ల గ్రామ పంచాయతీల్లో "కిల" (కేరళ ఇన్స్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్) కేరళ బందం మంగళవారం పరిశీలన చేసింది. గ్రామ పంచాయతీల్లోని సచివాలయాలను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు తదితర అంశాలను తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బంది, మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఐఎస్ఒ సర్టిఫికెట్ పొందేందుకు ఉండాల్సిన ప్రమాణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలియజేశారు. ఈ సందర్భంగా కేరళ బందం కిలా డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ సోనియా మాట్లాడుతూ తాము పరిశీలించిన సచివాలయాల్లో రికార్డుల నిర్వహణ ఐఎస్ఒ ప్రమాణాలకు అనుగుణంగా లేవన్నారు. ప్రతి పంచాయతీకి తప్పనిసరిగా రికార్డు రూం ఉండాలన్నారు. రికార్డు రూమ్‌లో కేటగిరి వారీగా సంవత్సరాల ప్రకారం రికార్డులను భద్రంగా ఉంచాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సచివాలయ వ్యవస్థ ఉద్దేశం బాగున్నా ఆచరణలో అది కనబడటం లేదని అన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్లు, ఫీడింగ్ రూం ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. గ్రామసభల నిర్వహణకు సంబంధించి ముందస్తుగా నోటీసు బోర్డులో తేదీలు పొందుపరచాలాన్నారు. సమాచార బోర్డు, ఉద్యోగుల వివరాలకు సంబంధించిన బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. సరైన బిల్డింగ్ ఉన్నప్పటికీ నిర్వహణ లోపం ఉందన్నారు. వీటిని మెరుగు పరుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పంచాయతీ వ్యవస్థపై అవసరం అయితే సిబ్బంది శిక్షణ తీసుకోవాలని సూచించారు. ఐఎస్ఒ సర్టిఫికెట్ పొందేందుకు తీసుకోవాల్సిన అన్ని చర్యల గురించి ఆమె సమగ్రంగా వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇంకా పైలెట్‌గానే గ్రామపంచాయతీల ఎంపిక కార్యక్రమం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఒ శివనారాయణ రెడ్డి, ఈవోఆర్డీ ఈశ్వరయ్య, కార్యదర్శి మధుసుధన్ పాల్గొన్నారు. కాగా కిలా బృందం పర్యటన సందర్భంగా పంచాయతీ ఎంపికకు అర్హత సాధించేలా ఏర్పాట్లు చేసేందుకు పంచాయతీ అధికారులు ముప్పతిప్పలు పడ్డారు. చిలమత్తూరు సచివాలయంలో ఎప్పుడూ లేనిది రిసెప్షన్ కౌంటర్‌ను కూడా ఏర్పాటు చేసి షో చేశారు.

గ్రామ పంచాయతీల నిర్వహణలో కేరళ టాప్

గ్రామ పంచాయతీల నిర్వహణలో కేరళ రాష్ట్రం దేశంలోనే టాప్‌లో ఉందని సోనియా తెలిపారు. కేరళలో ప్రతి పంచాయతీకి ఐఎస్ఒ గుర్తింపు సర్టిఫికెట్ ఉన్నట్లు తెలియజేశారు. అక్కడ మౌలిక వసతుల కల్పన చాలా బాగాఉందన్నారు. రికార్డుల నిర్వహణ, గ్రామసభలు ఇలా అన్నింట్లోనూ అక్కడి పంచాయతీల పనితీరు సరైన పద్ధతిలో ఉంటుందని కితాబునిచ్చారు.

కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిని కలిసిన రఘువీరా

ప్రజాశక్తి మడకశిర

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన సిడబ్ల్యుసి సమావేశానికి మాజీ మంత్రి, సిడబ్ల్యుసి మెంబర్ నీలకంఠాపురం రఘువీరారెడ్డి హాజరయ్యారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జునను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఇరువురు పలు సమస్యలపై చర్చించినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో ఆంధ్ర పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

పొంచిఉన్న ప్రమాదం

ప్రజాశక్తి - సోమందేపల్లి

మండల కేంద్రంలోని పాత ఊర్లో గల ఇనుప విద్యుత్ స్తంభం సగానికి పైగా చీలిపోయి కూలడానికి సిద్ధంగా ఉంది. ఈ విద్యుత్ స్తంభానికి మరమ్మతులు చేయకుండా అలానే వదిలేస్తే పెద్ద ప్రమాదమే సంభవించి ప్రాణ, ఆస్తి నష్టం జరిగే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పలుమార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడంలేదని వారు వాపోతున్నారు. ఈసందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి రంగప్ప మాట్లాడుతూ అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని లేని పక్షంలో స్థానికులతో కలిసి విద్యుత్ కార్యాలయం ముందు ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

అబద్దాలకోరు జగన్ : టిడిపి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

చంద్రబాబునాయుడు అరెస్టు గురించి తనకు తెలియదని ఆ సమయంలో తాను లండన్‌లో ఉన్నానని సిఎం జగన్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ధర్మవరంలోని తన నివాసంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పరిటాల శ్రీరామ్ మాట్లాడారు. జగన్ చేస్తున్న వ్యాఖ్యలను చూసి జనం చీదరించుకుంటున్నారన్నారు. చంద్రబాబును అరెస్టు చేయించింది ఎవరు అంటే రాష్ట్రంలో చిన్నపిల్లాడిని అడిగినా చెబుతారన్నారు. స్కిల్ డెవలప్మెంట్ ద్వారా లక్షల మందికి ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగాలు కల్పిస్తే దానికి బహుమతిగా చంద్రబాబును జగన్ అరెస్టు చేయించారన్నారు. అధికారంలో ఉండగా ఏ ఒక్క మంచి పని చేయని జగన్ ప్రతిపక్షాలపై కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నారన్నారు. ప్రస్తుత పరిణామాలన్నీ చూస్తున్న ప్రజలు జగన్ ప్రభుత్వంపై ఆగ్రహంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, నాయకులు ఫణికుమార్, పురుషోత్తంగౌడ్, కేశగాళ్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా కల్వర్టు పనులు

వాహనదారులకు ఇబ్బందులు పట్టించుకోని అధికారులు



గుంతలు పడ్డ రహదారిని చూపిస్తున్న వ్యక్తి

ప్రజాశక్తి మడకశిర

నాణ్యత లేని కల్వర్టు నిర్మాణాలు, గుంతల పడ్డ రోడ్లతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మడకశిర నుండి పెనుకొండకు వెళ్లే రహదారిలో ఆర్. అనంతపురం జమ్మానిపల్లి గేట్ సమీపంలో కల్వర్టు నిర్మించారు. నిర్మాణం జరిగి ఏడాది కూడా పూర్తి కాక మునుపే కల్వర్టు దెబ్బతింది. కల్వర్టు రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. దీంతో రాత్రి పూట వెళ్లే వాహనచోదకులు ఇక్కడ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాణ్యమైన కల్వర్టు నిరామణాలు చేపట్టాలని, గుంతలు పడ్డ రోడ్లకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మొరాయిస్తున్న సర్వర్లు.. అందని రేషన్ సరుకులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందిస్తున్న రేషన్ బియ్యం పది రోజులు గడుస్తున్నా కార్డుదారులకు అందలేదు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇంటింటా రేషన్ బియ్యం పంపిణీకి సంబంధించిన బియ్యం డీలర్ల గోడౌన్‌లో మగ్గుతున్నాయి. పేదలు సంచులు, రేషన్ కార్డులు చేతబట్టుకొని డీలర్ల ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారు. ఒకటవ తేదీ నుండి ఇప్పటివరకు ఫింగర్ ప్రింట్స్ యంత్రాలకు సర్వర్ సరిగ్గా రావటం లేదని దీంతో బియ్యాన్ని పంపిణీ చేయలేకపోతున్నామని డీలర్లు చెబుతున్నారు. రోజులో కనీసం ఒక గంట సేపు కూడా సర్వర్ పని చేయడం లేదని అంటున్నారు. దీంతో నిత్యావసర వస్తువులు పంపిణీ చేయలేకపోతున్నామని ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశామని తెలిపారు. రెక్కాడితే డొక్కాడని పేదలు కూలిపనిలు వదిలేసి, చిన్నపిల్లల పిల్లలను సంకనేసుకుని రేషన్ కోసం డీలర్ల ఇంటి ముందర పడి కాపులు కాస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పేదలకు బియ్యాన్ని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కార్డుదారులు కోరుతున్నారు.

వరండాలోనే 'జగనన్న ఆరోగ్య సురక్ష' మందులు

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి జిల్లాకు చేరిన జగనన్న ఆరోగ్య సురక్ష మందులను భద్రపరచడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారు. సౌకర్యాలు లేకనే ఇలాంటి పరిస్థితి వచ్చిందని అధికారులు అంటున్నారు. ప్రజల ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపడుతున్నట్లు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అది కనిపించడంలేదు. అధికారుల నిర్లక్ష్యం, ప్రభుత్వం సరైన ఏర్పాట్లు చేయక పోవడం వల్ల కోట్లాది రూపాయలు విలువచేసే మందులు వరండాలో నిల్వచేయడం విమర్శలకు దారితీస్తోంది. ప్రభుత్వం అందజేసిన మందులను భద్రంగా ఉంచాల్సిందిపోయి ఇలా వదిలివేయడం ఎంతవరకు సబబని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈపరిస్థితి జిల్లాకేంద్రమైన డిఎంహెచ్ఒ కార్యాలయంలో చోటుచేసుకుంది. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద 32 మండలాల్లో హెల్త్ క్యాంపుల నిర్వహణ ద్వారా ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం మందులను సరఫరా చేసింది. శ్రీ సత్య సాయి జిల్లాలో 41 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా, వాటి పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను జిల్లా వ్యాప్తంగా 397 వైద్య శిబిరాలు నిర్వహించాల్సుంది. వాటిలో రోజుకు 32 శిబిరాలను నిర్వహిస్తున్నారు. వీటికి సరిపడా మందులను జిల్లా కేంద్రాలకు తరలించారు. ఈ మందులను విడతల వారీగా ఆయా మండలాలకు తరలించి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల ద్వారా రోగులను పరీక్షించి మందులను పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఇందులో బాగంగా జిల్లాకు అవసరమయ్యే మందులను గత వారం రోజుల నుండి విడతల వారీగా డీఎంహెచ్ఒ కార్యాలయానికి చేరుతున్నాయి. ఈమందులను భద్రపరచుకుని ఆయా హెల్త్ సెంటర్లకు పంపిణీ చేయాల్సి ఉంటుంది. అయితే కార్యాలయానికి వచ్చిన మందులను భద్రపచడంలో అధికారులు పూర్తిగా నిరక్ష్యం వహిస్తున్నట్లు అక్కడ మందులను ఉంచిన పరిస్థితిని బట్టి తెలుస్తోంది. అనుకోకుండా వర్షం వస్తే వర్షపు నీటిలో మందులు బాక్సులు పాడైపోయి నష్టం వాటిల్లుతుంది. మరోవైపు ఎలుకలుకూడా బాక్సులను కొరికే అవకాశం ఉంది. రోగులకు అందాల్సిన మందులు ఇలా పాడవడం వలన రోగుల ఆరోగ్యం ఎలా బాగుపడుతుందనేది ప్రధాన ప్రశ్నగా మారింది. దీనిపై వైద్యాదికారిని వివరణ కోరగా మందులను భద్రపరచడానికి ప్రత్యేక గది లేకపోవడంవల్ల వరండాలోనే ఉంచాల్సి వచ్చిందన్నారు. త్వరలోనే ముందులను ఆయా కేంద్రాలకు పంపిణీ చేస్తామని చెప్పారు.

వరండాలో నిల్వ ఉంచిన మందుల పెట్టెలు, సంచులు

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

రొద్దం : మండలంలోని సానిపల్లి ఎంపియుపి పాఠశాలలో 6,7,8 తరగతి విద్యార్థులకు ఆంగ్ల ఉపాధ్యాయురాలు లక్ష్మీ నరసమ్మ మంగళవారం వర్క్ బుక్స్ ఉచితంగా అందించారు. అదే విధంగా 6 వ తరగతి విద్యార్థులకు గణిత ఉపాధ్యాయులు కృష్ణ నాయక్ గణిత వర్క్‌బుక్ ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ గౌడ్, ఉపాధ్యాయులు నారాయణ స్వామి, మోహన్ రెడ్డి,జయమ్మ, విద్యార్థుల ఎస్ ఎం సి చైర్మన్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలు

బత్తలపల్లి : ఖరీఫ్ సీజన్లో సాగు చేసిన సాగు చేసిన వేరుశనగ పంటకు సంబంధించి వ్యవసాయ, గణాంక శాఖ అధికారులు పంట కోత ప్రయోగాలను మంగళవారం నిర్వహించారు. మంగళవారం మండలంలోని అప్రాచెరువు గ్రామంలోని జయరామిరెడ్డి సాగు చేసిన వేరుశనగ పొలంలో పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఒ ఓబిరెడ్డి, మండల గణాంకాధికారి డాక్టర్ లక్ష్మీనరసింహారెడ్డి, ఎఇఒ ఉపేందర్ రెడ్డి, ఎంపిఇఒ రవిచంద్ర పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ వాయిదా

చెన్నేకొత్తపల్లి : ఈ నెల 18 న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి శ్రీ సత్యసాయి జిల్లాలో పర్యటిస్తున్నందున ఈ నెల 15 న మండల కేంద్రమైన చెన్నేకొత్తపల్లి తలపెట్టిన అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తదుపరి విగ్రహావిష్కరణ కార్యక్రమం తేదీని తెలియజేస్తామని చెప్పారు.

In the court of the Prl. District Judge, Ananthapuramu
E.P.No:585/2022 in O.S. No:867/2021

Between:
M/s.Shriram City Union Finance Limited, Dharmavaram. Rep by its Authorized Signatory, Asst. Manager, C.Muni Sekhar, Ananthapuramu ...petitioner/ D.Hr

And

1.K.Lakshmi Devi W/o Divakar Reddy,
2.K.Divakar Reddy S/o Govinda Reddy Both are R/of D.No:2-674, O.C.Colony, Near Z.P.H School, Bathalapalli,
3.J.Venkata Naga Praveen S/o Nagabhushanam, R/of D.No:4-434, Venkateswara Colony, Dharmavaram Road, Bathalapalli, Sri Sathya Sai District ...Respondents/J.Drs

వేలం ప్రకటన

అర్జీదారుడు తన ఇ.పి మొత్తమును రాబట్టుటకు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని పై తెలిపిన కోర్టులో వేలమునకు తెచ్చియున్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు 30/10/2023వ తేదిన ఉదయం 10:30 గం॥లకు పై కోర్టులో హాజరై కోర్టు షరతులకు లోబడి వేలంలో పాల్గొనవచ్చును.

SCHEDULE

Anantapur District, Hindupur Registration District. Sub-District, Bathalapali Village, 2nd ward, S.No.256/IA an extent of Ac.3.23 cents and in this site

Bounded by:
East-Land of J.Chinna subbarayadu West-School
North-House of K.Lakshmi Narasamma
South -Land Of J.Chinna subbarayadu With the above Boundaries, East to West 20 yards or 18.28 meters, North to South 6 yards or 5.470 meters, admeasuring 120 sq. Yards of site residential ground floor bulinding bearing oid door No.2/676 and new door No.5/184, with assessment No. 984 with door. frames windows, ventilators, current service connection etc.,' with right of way to reach the above property as per registered dt.25.05.2016 document No.1888/2016 plinth ac.1080 sqfts.

D.Hr Value Rs.24,00,000/-
Amena Value Rs.30,00,000/-

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
J.L.NARASIMHULU
D.Hr Advocate, Anantapuramu,

మహారాజశ్రీ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గారి
కోర్టు, కదిరి
O.S.NO:110/2023

Between:
చింతకాయల శ్రీనివాసులు, తండ్రి లేట్ సి.రామక్రిష్ణ డోర్ నెం:17-76, చెరువువాండ్లపల్లి గ్రామం, నల్లమాడ పోస్టు & మండలం శ్రీ సత్యసాయి జిల్లా. ...వాది

and

దేరంగుల గంగులప్ప మరియు 8 మంది ...ప్రతివాదులు

6వ ప్రతివాదికి సమను

ఇందుమూలముగా 6వ ప్రతివాది అయిన దేరంగుల గంగులమ్మ తండ్రి లేట్ రామప్ప, చెరువువాండ్లపల్లి గ్రామం నల్లమాడ పోస్టు & మండలం శ్రీ సత్యసాయి జిల్లా అయిన నీకు తెలియజేయడమేమనగా వాది తన దావాలో కనబరచిన షెడ్యూలు దాఖలా ఆస్తిపై పర్మినెంట్ ఇంజక్షన్ కొరకు దావా దాఖలు చేసుకున్నాడు. సదరు దావాలో మీ హాజరు నిమిత్తం 16/10/2023వ తేదిన వాయిదా వున్నది. కావున సదరు తేదినాడు మీరు స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ ఉదయం 10:30 ని॥లకు పై తెలిపిన కోర్టులో హాజరు అయి మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

స్థలం:కదిరి
వాయిదా:16/10/2023

కె.చౌదప్ప, బియస్సి, బి.ఎల్,
వాదిపరం వకీలు, కదిరి,
సెల్:9966350645.

మహారాజశ్రీ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గారి
కోర్టు, కదిరి
O.S.NO:38/2020

Between:
1.కాల్ల వెంకటరమణ తండ్రి బూదిలప్ప,
2.కాల్ల క్రిష్టప్ప తండ్రి బూదిలప్ప,
3.కాల్ల చిన్న వెంకటరమణ తండ్రి బూదిలప్ప, all are residing of D.No:2-152, బుచ్చిరాజుపల్లి గ్రామం తంగేడుకుంట పోస్టు ఓ.డి.సి.మండలం శ్రీ సత్యసాయి జిల్లా ...వాదులు

and

సాక పార్వతమ్మ మరియు ఏడుగురు. ...ప్రతివాదులు

3,4 మరియు 8వ ప్రతివాదులకు సమను

ఇందుమూలముగా 3వ ప్రతివాది అయిన సాక నాగమణి తండ్రి లేట్ వెంకటసుబ్బయ్య residing of D.No:30-560 కొత్తపేట, ధర్మవరం టౌన్ & మండలం మరియు 4వ ప్రతివాది అయిన నీరు గట్టి సంజీవప్ప తండ్రి చిన్న యల్లప్ప D.No:30-261 కొత్తపేట, ధర్మవరం టౌన్ & మండలం మరియు 8వ ప్రతివాది అయిన దేవనపాల్యం రంగప్ప తండ్రి దిన్నీరప్ప, ఎంప్లాయి ఇన్ ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, residing at హిందూపురం గ్రామం & పోస్టు & మండలం, అనంతపురం జిల్లా Now శ్రీ సత్యసాయి జిల్లా అయిన మీకు తెలియజేయడమేమనగా వాదులు తన దావాలో కనబరచిన షెడ్యూలు దాఖలా ఆస్తిలో హక్కు భాగసరిస్కారం కొరకు దావా దాఖలు చేసుకున్నాడు. సదరు దావాలో మీ హాజరు నిమిత్తం 31/10/2023వ తేదిన వాయిదా వున్నది. కావున సదరు తేదినాడు మీరు స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ ఉదయం 10:30 ని॥లకు పై తెలిపిన కోర్టులో హాజరు అయి మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

స్థలం:కదిరి
వాయిదా:31/10/2023

కె.చౌదప్ప, బియస్సి, బి.ఎల్,
వాదిపరం వకీలు, కదిరి,
సెల్:9966350645.

మృతుని కుటుంబానికి అండగా ఉంటాం : కెవిపిఎస్

విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

లేపాక్షి : ఆత్మహత్యకు పాల్పడిన భూపోరాట రైతు వెంకటేష్ కుటుంబానికి అండగా ఉంటామని కెవిపిఎస్ నాయకులు అన్నారు. కెవిపిఎస్ మండల కార్యదర్శి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. కుశలవ ఆర్గానిక్ కంపెనీకి రైతులకు మధ్య జరుగుతున్న భూపోరాటంలో భాగంగా అధికారుల తీరుకు మనస్థాపం చెందిన వెంకటేష్ తన పొలం లో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. అయితే అతని మృతిపై కొందరు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. బాధితుడి తండ్రి కుశలవ కంపెనీకి భూమిని అమ్మివేయడంతో చేసుకోవడానికి పనిలేక పని చేయడానికి పొలం లేక ఇబ్బంది పడుతుండేవాడన్నారు. మృతుని కుటుంబానికి తాము అండగా ఉంటామన్నారు. వారికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని చెప్పారు. కేసు తప్పు దోవ పట్టించడానికి కుట్రలు పన్నితే సహించేది లేదన్నారు. ఈ సమావేశంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, జిల్లా కార్యదర్శి రమణ, వెంకటేష్, కమిటీ సభ్యులు నారాయణప్ప, క్రిష్టప్ప, రైతు లు గంగాధరప్ప, రామకృష్ణపప, నరసింహప్ప, తిప్పన్న పాల్గొన్నారు.

కార్మికుల పట్ల నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి - చిలమత్తూరు

గ్రామపంచాయతీ కార్మికులకు,స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యల పట్ల పాలకులకు, అధికారులకు నిర్లక్ష్యం తగదని గ్రామ పంచాయతీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ అన్నారు. కార్మికుల పరిష్కరించాలని కోరుతూ చిలమత్తూరు సచివాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు మంగళవారం ఆందోళన చేపట్టారు. డిఎల్‌పిఒ శివనారాయణరెడ్డి సచివాలయం తనిఖీకి వచ్చిన నేపథ్యంలో కార్యాలయం వద్ద ఆయనను అడ్డుకున్నారు. క్లాప్ మిత్రలకు 10 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గత నెల 19 వ తేదిన డీపీవో అన్ని పంచాయతీలలో పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఆదేశాలు జారీ చేసినా చిలమత్తూరు మండలంలో ఇప్పటి వరకు సంబందిత కార్యదర్శులు వేతనాలు పెట్టలేదని విమర్శించారు. ప్రస్తుతం ఆందోళన నేపథ్యంలో కేవలం 2 నెలల వేతనాలు చెల్లిస్తామని చెప్పడం విడ్డురంగా ఉందని అన్నారు. పూర్తిగా 10 నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు డిఎల్‌పిఒ స్పందిస్తు కార్మికుల వేతనాలు పెండింగ్ లేకుండా చెల్లించాలని ఈవోఆర్డీ ఈశ్వరయ్యను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో సిఐటీయు నాయకులు వెంకటేష్, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైసిపికి చరమగీతం : జనసేన

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

వైసిపికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు చరమగీతం పాడుతారని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం తన స్వగృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై ముఖ్యమంత్రి చేసిన వాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి ప్రతిపక్షాలపై, జనసేన పార్టీపై విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ఇక స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తీరును ఎద్దేవా చేశారు. ఆయన తండ్రి ఎవరి పల్లకీ మోసీ ధర్మవరం ఎమ్మెల్యే అయ్యాడో తెలుసుకుని ఇంకొకరిని విమర్శించాలన్నారు. వైసీపీని గద్దె దించడానికి అన్ని రాజకీయ పార్టీలు సిద్ధమయ్యారన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి తన బాషను మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మత్స్యకార విభాగపు రాష్ట్ర ప్రధానకార్యదర్శి బెస్తశ్రీనివాసులు, నాయకులు అడ్డగిరి శ్యాంకుమార్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతుల కష్టాలు పట్టించుకోని ప్రభుత్వం : టిడిపి

వేరుశనగ పంటను పరిశీలిస్తున్న పరిటాల సునీత, తదితరులు

ప్రజాశక్తి - కనగానపల్లి

రాష్ట్రంలో విద్యుత్ సరఫరా సరిగా లేక పంటలన్నీ నిలువునా ఎండిపోతున్నాయని రైతుల కష్టాలను పట్టించుకోకుండా ప్రతిపక్షాలను వేధించడమే సిఎం పనిగా పెట్టుకున్నారనిమాజీ మంత్రి పరిటాల సునీత విమర్శించారు. మండలంలోని తగరకుంట, నరసంపల్లి తదితర గ్రామాల్లో విద్యుత్ కొరతతో ఎండుతున్న వేరుశనగ, వరి, టొమాటో, చీనీ పంటలను ఆమె మంగళవారం పరిశీలించారు. అక్కడ రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. తగరకుంట గ్రామంలో వడ్డిపల్లి రామకృష్ణ అనే రైతు 4.50 ఎకరాలలో ఒక లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టి వేరుశనగ సాగు చేశాడు. విద్యుత్ కోతల వల్ల వేరుశనగ పంట మొత్తం వాడిపోయి ఎండిపోయే దశలో ఉంది. కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి రాని పరిస్థితి ఉందని పరిటాల సునీత ఈసందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డుపల్లి ఎర్రిస్వామి అనే రైతు 3ఎకరాలలో లక్ష రూపాయల పెట్టుబడి పెట్టి వరి, వేరుశెనగ సాగు చేశాడు. వరి పంట వెన్ను వేసే దశలో ఉందని.. ప్రస్తుతం వరి, వేరుశనగ రెండు పంటలు ఎండిపోతున్నాయని బాధిత రైతు పరిటాల సునీత వద్ద వాపోయాడు. రైతుల సమస్యలు తెలుసుకున్న అనంతరం సునీత మాట్లాడుతూ న్నికల ముందు 9 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామనిజగన్ రెడ్డి ప్రగల్బాలు పలికారని.. కానీ ఇప్పుడు కనీసం నాలుగు గంటలు కూడా ఇచ్చే పరిస్థితి లేదని అన్నారు. రైతులకు సాయం అందించాల్సింది పోయి విద్యుత్ సరఫరా సరిగా చేయకపోతే రైతులు ఎలా పంటలు పండిస్తారని ప్రశ్నించారు. ఇలాంటి అసమర్థ ముఖ్యమంత్రి వల్ల రైతులు పంటలు కోల్పోవాల్సి వస్తుందని అన్నారు. ఇప్పటికైనా 9 గంటల ఉచిత విద్యుత్ అందించకపోతే రైతుల పక్షాన తెలుగుదేశం పార్టీ పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ యాతం పోతలయ్య, సర్పంచులు మాధవరాజు, సోమర చంద్ర శేఖర్, నాయకులు సుధాకర్ చౌదరి, రంగయ్య, బోదుల రామాంజి, రాజకష్ణ, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కాపాడాలని వినతి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

ముదిగుబ్బ మండలం గుంజేపల్లి రెవిన్యూ పరిధిలో కోట్లాది రూపాయల విలువచేసే ప్రభుత్వ భూములు కబ్జా దారుల కోరల్లోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ముదిగుబ్బ పట్టణ చెందిన పలువురు కోరారు. ఈ మేరకు మంగళవారం ముదిగుబ్బ గ్రామానికి చెందిన అధికసంఖ్యలో ప్రజలు పుట్టపర్తి కలెక్టర్ కార్యాలయానికి వచ్చారు. కలెక్టర్ అందుబాటు లేకపోవడం వల్ల అక్కడ ఉన్న అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కంఠగాని నారాయణ స్వామి, మాజీ ఎంపిటిసి లక్ష్మీనారాయణ, దేవేంద్ర నాథ్ రెడ్డి, దిలీప్, నీలకంఠ, లక్ష్మీనారాయణ, సురేష్ రెడ్డి, రాఘవ, రామాంజి, నెట్టెం భాస్కర, చలపతి, గుర్రం చంద్ర, పోతలయ్య, లేపాక్షి, డాన్ లక్ష్మీనారాయణ, పి.రామ్మోహన, తదితరులు మాట్లాడుతూ ముదిగుబ్బకు ఆనుకొని ఉండే గుంజేపల్లి రెవెన్యూ స్థలంలో 823 బి, 821 సర్వే నంబరు సంబంధించి దాదాపు రెండెకరాల ఇరవై రెండు సెంట్ల దాకా ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఈ భూమి హైవేకి అనుకొని ఉండడంతో పాటు ఆ భూమి పక్కనే ముదిగుబ్బ గ్రామం లోకి ప్రవేశించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు కొన్ని భవనాలు కూడా ఇక్కడ నిర్మించడంతో ఆ భూమి విలువ భారీగా పెరిగిందన్నారు. ఆ భూమిపై కన్నుపడిన కొందరు కబ్జాదారులు ఆక్రమించి ప్లాట్లు వేసి అమ్ముకోవడానికి కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపించారు. ఇప్పటికే కబ్జాదారులు ఆ భూమిలోకి వెళ్లి జెసిబితో చదును చేయించారన్నారు. విలువైన ఈ భూములు భవిష్యత్తులో ప్రభుత్వ కార్యాలయాలకు పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగపడతాయన్నారు. మండల స్థాయి అధికారులు కూడా కబ్జాదారులతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకొని చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. విలువైన ప్రభుత్వ భూములను గుర్తించి అన్యక్రాంతం కాకుండా చూడాలని వారు కోరారు.

చెస్‌లో సత్తా చాటిన గ్రామీణ విద్యార్థి

ప్రజాశక్తి - మడకశిర

ప్రతిభా విద్యార్థులకు అభినందన

కర్నాటక సరిహద్దు ప్రాంతంలోని ఓ మారుమూల గ్రామానికి చెందిన విద్యార్థి చెస్ క్రీడలో సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. నియోజకవర్గ పరిధిలోని అమరాపురం మండలం నిద్రగట్ట గ్రామనికి చెందిన ప్రకాష్ శారదమ్మ కుమారుడు ప్రజ్వల్ శిరా తాలూకా రంగనాథ్ పురంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రెసిడెన్షియల్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. కొన్ని రోజులుగా పావగడలో బాల బాలికలకు జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో పాల్గొన్న ప్రజ్వల్ మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.చక్కటి ఆట తీరు కనబరిచి గ్రామానికి మంచి పేరు తీసుకొచ్చిన ప్రజ్వల్ ను గ్రామస్తులతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

న్యాయం చేయండి

ధర్మవరం టౌన్ : ధర్మవరం ప్రెస్‌క్లబ్‌లో 2022లో అధికార పార్టీకి చెందిన వారు తమపై దాడి చేసిన కేసులో ఇంతవరకు న్యాయం చేయాలని ఇప్పటికైనా న్యాయం చేయాలని ఎపి ఎంఆర్‌పిఎస్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ బాలిగొల్ల పరమేష్ కోరారు. ఈ మేరకు ఆయన తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎస్పీకి అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ తమపై దాడి చేసిన వారికి శిక్ష కూడా పడలేదన్నారు. వారిపై ఎలాంటి చర్యలు కూడా తీసుకోలేదని విమర్శించారు. పోలీసు వారు కేసును తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. స్థానిక అధికార పార్టీ ఎమ్మెల్యే అండదండలతో పోలీసు వారు తమకు న్యాయం చేయలేదని అన్నారు. ఇప్పటికైనా స్పందించి తమకు న్యాయం చేయాలని, తమపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నీటి హక్కుల కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచాలి

ప్రజాశక్తి-హిందూపురం

కృష్ణా జలాల పున:పంపిణీపై రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదాలకు దారి తీసేలా బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు అధికారాన్ని కట్టబెడుతూ కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్‌ను తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఉమ్మడి అనంతపురం జిల్లా జలసాధన సమితి గౌరవ అధ్యక్షులు, అడ్వకేట్ రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. కృష్ణానది జలాలను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు పంపిణీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ట్రిబ్యునల్ ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తు జలసాధన సమితి ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్ లో నిరసన తెలుపుతు కేంద్ర ప్రభుత్వనికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అక్కడి నుంచి తహసీల్దార్ కార్యలయం వరకు ర్యాలీ చేపట్టారు. ఆర్‌ఐ అమరేంద్రకు వినతిని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జలసాధన సమితి నాయకులు ఒపిడిఆర్ శ్రీనివాసులు, రచయిత సడ్లపల్లి చిదంబరెడ్డి, ఎస్‌డిజిఎస్ కాలేజ్ ప్రిన్సిపల్ నాగేంద్ర కుమార్, జమీల్, ఆదినారాయణ, తూమకుంట పారిశ్రామిక వాడ కార్మిక సంఘం నాయకులు రవి, గంగిరెడ్డి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న జలసాధన సమితి నాయకులు

ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండలంలోని ఉద్యోగ ఉపాధ్యాయులు చాలామందికి వేతనాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారికి వెంటనే వేతనాలు చెల్లించాలనిఉపాధ్యాయుల సంఘం యూనియన్ సత్యసాయి జిల్లా అధ్యక్షులు జి రామ్మోహన్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రెండు నెలల నుంచి వేతనాలు అందక తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కస్తూరిబా పాఠశాల సిబ్బందికి కూడా రెండు నెలల నుంచి వేతనాలు అందలేదన్నారు. ఎంఆర్సీలో విధులు నిర్వహిస్తున్న సిఆర్పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు రెండు నెలల నుంచి వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రతినెల 1వ తేదీ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సత్య సాయి జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు

నకిలీ ధ్రువపత్రాలపై విచారణ జరపండి : ఎంపిపి

ప్రజాశక్తి - తలుపుల

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి

వికలాంగుల నకిలీ ధ్రువ పత్రాలపై విచారణ చేపట్టాలని ఎంపీపీ రఫీ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓ వ్యక్తి వికలాంగుల సర్టిఫికెట్లు ఇప్పిస్తానంటూ ప్రజల నుండి వేల రూపాయలు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని, వాటిపై విచారణ జరపాలని కోరారు. మండల వ్యాప్తంగా సుమారు 90 పైగా నకిలీ ధ్రువపత్రాలు ఉన్నాయన్నారు. వీటిపై విచారించి నిజమైన వికలాంగులకు న్యాయం చేయాలని కోరారు.

ఆటోనగర్‌లో అధికార పార్టీ నాయకులకు చేదు అనుభవం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఆటో నగర్‌లో అధికార పార్టీ నాయకులకు, కౌన్సిలర్‌కు చేదు అనుభవం ఎదురైంది. మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో కౌన్సిలర్ సునీత వెంకటేష్ రెడ్డి, బి బ్లాక్ కన్వీనర్ వాల్మికి నరేష్‌తో పాటు ఇతర పార్టీ నాయకులు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నారు. స్థానిక యువకులు వారి ర్యాలీని అడ్డుకున్నారు. ఆటోనగర్‌లో ప్రజలకు అవసరమైన కనీస మౌళిక సదుపాయాలు లేవని, మౌళిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరిస్తామని సహకరించాలని ఆటోనగర్ యువకులకు నాయకులు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు.

అధికార పార్టీ నాయకులతో స్థానికుల వాగ్వాదం

నేరాలు ఘోరాలు

మహిళ ఆత్మహత్యాయత్నం
కాపాడిన రైల్వేపోలీసులు

ధర్మవరం టౌన్ : కుటుంబ సమస్యల కారణంగా ధర్మవరంలో సోమవారం రాత్రి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకోబోతున్న మహిళను రైల్వే జేఆర్పే పోలీసులు కాపాడారు. రైల్వే జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలు... అనంతపురం పట్టణంలోని నందమూరినగర్‌కు చెందిన షర్మిలాబాను తన పిల్లలతో కలిసి రైలుకిందపడి ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించింది. గమనించి రైల్వే పోలసీఉలు ఆమెను స్టేషన్ కు పిలుచుకుని వచ్చి కౌన్సిలింగ్ ఇచ్చారు. భర్త, అత్తతో ఉన్న గొడవల వల్ల తాను ఆత్మహత్య చేసుకోవాలని వచ్చానని షర్మిలాబాను పోలీసులకు తెలిపింది. షర్మిలాబాను తల్లిదండ్రులకు సమాచారం అందించి వారికి అప్పగించామని రైల్వే జేఆర్పే పోలీసులు తెలిపారు.

ప్రచారంలో ప్రమాదం..ఇద్దరికి గాయాలు

ధర్మవరం టౌన్ : ధర్మవరం పట్టణంలో మాంగళ్య నూతన షాపింగ్ మాల్ ప్రారంభం సందర్భంగా సిబ్బందితో బ్యానర్లతో ప్రచారంచేస్తుండగా ప్రమాదవ శాత్తు విద్యుత్‌షాక్‌కు గురై ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అందుకు సంబంధించిన వివరాలు... పట్టణంలో మాంగళ్య షాపింగ్ మాల్ ప్రారంభం సందర్భంగా ప్రచార రథం ద్వారా ప్రచారం చేసున్నారు. ఈ క్రమంలో లక్ష్మీ చెన్నకేశవపురంలో ప్రచారం నిర్వహిస్తున్న క్రమంలో ప్రచార రథానికి ఉన్న ఇనుప కడ్డీలకు విద్యుత్‌లైను తలిగింది. దీంతో అందులో ఉన్న ఇద్దరుకార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కరెంటు తీగలు తెగిపడి ఆవు మృతి

లేపాక్షి : మండల కొండూరు గ్రామంలో విద్యుత్‌తీగలు పడి ఆవు మృతిచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రైతు నాగరాజు రోజు వారిగా మేత కోసం పొలాల్లోకి ఆవులను తీసుకెళ్లాడు.అక్కడున్న విద్యుత్ తీగలు ఆవు మీద పడి షాక్‌కు గురై మృతిచెందింది. ఈ విషయంపై ట్రాన్స్‌కో ఎఇ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు తెలిపారు.

సెబ్ అధికారుల దాడులు

పుట్టపర్తి రూరల్ : శ్రీ సత్య సాయి జిల్లా అడిషనల్ ఎస్పీ, సెబ్ అధికారి ఆధ్వర్యంలో జిల్లాలో పలు ప్రాంతాలలో మంగళవారం జరిపిన దాడులలో పలువురుపై కేసులు నమోదు అయ్యాయి. నాటు సారా, కర్నాటక మద్యం, నాటు సారా ఊటను స్వాధీనం చేసుకొని అధికారుల సమక్షంలో ధ్వంసం చేశారు. ఈ మేరకు శ్రీ సత్య సాయి జిల్లా అడిషనల్ ఎస్పీ తెలిపిన వివరాలు.. జిల్లా పరిధిలోని సి కే పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని, కనగానపల్లి మండలం, వేపకుంటపల్లి గ్రామ శివారులలో 60 లీటర్ల నాటుసార ఊటను ధ్వంసం చేశారు. అదేవిధంగా హిందూపురం సెబ్ స్టేషన్ పరిధిలోని పరిగి మండలం కోడిగనహళ్లి గ్రామానికి చెందిన నాగరాజు అనే వ్యక్తి వద్ద నుండి 30 బాటిళ్ల కర్నాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్న వాహనాన్ని సీజ్ చేశారు. తనకల్లు స్టేషన్ పరిధిలోని కావలి అలివేలమ్మ వద్దనుండి 71 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. తూముకుంట చెక్‌పోస్టు వద్ద జి బజ్జప్ప నుండి పది హైవార్డ్స్, 15 విస్కీ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. శ్రీకర్త పురానికి చెందిన శ్రీరామప్ప వద్ద నుండి 15 ఓల్డ్ మంక్ బాటిల్స్, 55 విస్కీ బాటిల్స్ , ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా మడకశిర పోలీస్ స్టేషన్ పరిధిలోని వి అగ్రహారం గ్రామానికి చెందిన శివన్న వద్ద నుండి 24 హైవార్డ్స్ చీప్ లిక్కర్ బాటిల్స్ ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులలో ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించినట్లు అడిషనల్ ఎస్పీ విష్ణు తెలిపారు.

వాహనాల వేలం

బుక్కపట్నం : వివిధ మద్యం కేసులలో పట్టుబడ్డ వాహనాలను జిల్లా ఎక్సైజ్ అధికారుల ఆదేశాల మేరకు ఈనె 12న వేలం వేయనున్నట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు. మద్యం కేసులో పట్టుబడ్డ ఒక ఆటో, రెండు మోటార్ సైకిళ్లను వేలం వేనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనవారు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

హిందూపురం : పట్టణంలోని అంబేద్కర్ నగర్ ప్రాంత సమస్యలను అధికారులతో మాట్లాడి పరిష్కారిస్తామని వైసిపి నాయకులు వేణు రెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయంలో వేణురెడ్డిని అంబేద్కర్ నగర్ వాసులు కలిసి తమ ప్రాంత సమస్యలతో పాటు అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సహాయ కార్యదర్శి కోటిపి హనుమంతరెడ్డి, వైసిపి నాయకులు సుభాష్ గాంధీ, నవీన్, శరత్, అశోక్, చిన్న, రాము, వినయ్, కిరణ్‌తో పాటు అంబేద్కర్ నగర్ ప్రాంత వాసులు పాల్గొన్నారు.

అక్రమాల నిగ్గు తేల్చండి

హిందూపురం : పెనుకొండ డివిజన్ వ్యాప్తంగా అటవీశాఖలో జరుగుతున్న అక్రమాలపై త్రిసభ్య కమిటీ వేసి సమగ్ర విచారణ జరిపించాలని పర్యావరణ వేత్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు పర్యావరణ వేత్తలు పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు మంగళవారం నిరసన తెలిపి, అధికారికి వినతిని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పర్యావరణవేత్తలు భాస్కర్ నాయుడు, భాస్కర్ రెడ్డి, నేషనల్ హ్యూమన్ రైట్స్ కల్చర్ అండ్ నేచర్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ హరిలాల్ నాయక్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

మడకశిర : మండల పరిధిలోని క్యాంపురం గ్రామంలో డెంగీతో మృతిచెందిన రామచంద్ర కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే ఈరన్న మంగళవారం పరామర్శించారు. రామచంద్ర సోమవారం డెంగీతో మృతిచెందాడు. రామచంద్రకు తల్లి, భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కూలి పని చేస్తే కానీ పూట గడవని ఆ కుటుంబం రామచంద్ర మృతితో వీధిన పడింది. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే కోరారు. జమ్మనపల్లికి చెందిన టిడిపి నాయకులు, వార్డ్ మెంబర్ అంజనప్ప గత వారం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే ఈరన్న గ్రామానికి వెళ్లి అంజినప్పను పరామర్శించారు. ఈ కార్యక్రమంల మాజీ ఎంపీపీ అశ్వత్థామప్ప డీలర్ల సంఘం మాజీ అధ్యక్షులు అధ్యక్షులు క్రిష్టప్ప, నాయకులు కరియన్న, పత్తికొండ నరేష్, పూజారి రంగప్ప, సీనప్ప, భక్తరపల్లి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఎస్ఐకు సన్మానం

తనకల్లు : మండలం నుంచి బదిలీపై వెళుతున్న ఎస్ఐ రాంభూపాల్ యాదవ్‌ను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాంభూపాల్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయపార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించండి

నల్లచెరువు : మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఎస్ఐ లింగన్న కోరారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ లింగన్నను ఎంపిపి రమణారెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ బట్టి హైదరవలి, పూలకుంట ఎంపీటీసీ నరసింహారెడ్డి, రాజశేఖర్ తదితరులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మండలంలో నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించి పేద ప్రజలకు న్యాయం చేయాలని వారు ఎస్ఐను కోరారు.

4న పెనుకొండలో ఉచిత గుండె వైద్యశిబిరం

పుట్టపర్తి అర్బన్ : ధర్మవరం ఆత్మీయ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఈనెల 14న పెనుకొండ ఆక్సియల్ క్లబ్‌లో ఉచిత గుండె వైద్య శిబిరము ఏర్పాటు చేస్తున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్ర రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సుధాకర్ తెలిపారు. ఈ మేరకు వారు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మార్క్ సూపర్ స్పెషాలిటీ గుండె ఆసుపత్రి వైద్యులు ఆత్మీయ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

డిఎంహెచ్ఒ తనిఖీ

ముదిగుబ్బ : మండల పరిధిలోని మల్లేపల్లి 2లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని డిఎంహెచ్ఒ కృష్ణారెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. కౌంటర్లను, ఒపి నమోదు పరిశీలించారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన న్యూట్రిషన్ స్టాల్స్ ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో వైద్యా ధికారులు నాగేంద్ర నాయక్, లక్ష్మి నారాయణ, హవిలా, వెంకట నారాయణ రెడ్డి, ఎంపిహెచ్ఒ వేణు గోపాల్ రెడ్డి, ఎంఇఒ రమణప్ప, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టు రాజకీయ కుట్ర

మడకశిరలో ర్యాలీలో పాల్గొన్న గుండుమల, తదితరులు

సంతకాలు సేకరిస్తున్న గోనుగుంట్ల అభిమానులు

విలేకరులతో మాట్లాడుతున్న కందికుంట వెంకటప్రసాద్

ప్రజాశక్తి - కొత్తచెరువు

రాజకీయ కుట్రతోనే చంద్రబాబు నాయుడుని వైసీపీ ప్రభుత్వం అరెస్టు చేయించిందని మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 32 రోజులగా రాష్ట్రవ్యాప్తంగా దీక్షలు నిరసనలు ధర్నాలు కార్యకర్తలు చేస్తున్నారని తక్షణమే ఆయనకు బెయిల్ మంజూరు చేయాలని అన్నారు. నాలుగున్నర సంవత్సరాలుగా వైసిపి ప్రభుత్వం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని సంక్షేమ పథకాలు పేరుతో అప్పులపాలు చేశారన్నారు. అభివృద్ధి అనేది ఎక్కడా కనిపించడం లేదన్నారు. ప్రజల చేత ఎంపికైన సర్పంచులకు ఏమాత్రం విలువ లేదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మండల కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, టిడిపి నాయకులు వెంకటరమణప్ప, నాగేందర్, ప్రసాద్, గాజుల చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : రాష్ట్రంలో వైసిపి అరాచక పాలనను అంతమొందిద్దామని టిడిపి సత్యసాయి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, ఎస్సీ సెల్ నియోజవర్గ అధ్యక్షురాలు యశోద రాయుడు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అవలంబిస్తున్న నిరంకుశ, అరాచక పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం వచ్చిందన్నారు. చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసిన దానికి వైసిపికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు.. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షులు లావణ్య గౌడ్, టౌన్ కన్వీనర్ జంగం వెంకటరాముడు, నాయకులు బాలు, అక్కులప్ప, టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు శ్రీనివాసులు, సురేష్, గొర్లకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ కు నిరసన గా మంగళవారం సాయంత్రం టీడీపీ జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గం ఇంచార్జ్ బి. కె.పార్థసారథి ఆధ్వర్యంలో పట్టణంలోని నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన్నప్పయ్య, రామలింగ, రఘువీర, చిన్నవెంకటరాముడు, రాంపురం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఓబుల దేవర చెరువు : చంద్రబాబు నాయుడు అరెస్టును ఖండిస్తూ ఓబులదేవర చెరువులో టిడిపి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. చంద్రబాబును రాజకీయ కక్షతోనే జైలుకు పంపించారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జయచంద్ర, ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్, డాక్టర్ జాకీర్ అహ్మద్, నిజాం, ఓబుల్ రెడ్డి, బోయపల్లి శివారెడ్డి, అంజినప్ప, షామున్, సర్పంచి షాను, కంచి సురేష్, మండే జి ఆరిఫ్ ఖాన్, సౌదీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా మండలం పరిధిలోని ఆర్ అనంతపురం పంచాయతీలో నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టు అక్రమమని అన్నారు. ఈసందర్భంగా రేకులకుంటా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన నరసింహామూర్తి, జయరాం గౌడ్, తో పాటు 10 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి గుండుమల తిప్పేస్వామి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి కోట్ల రంగేగౌడ, రిటైర్డ్ ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్ మల్లికార్జున, క్లస్టర్ ఇన్‌ఛార్జి కన్నా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : చంద్రబాబునాయుడు అరెస్టుకు వ్యతిరేకంగా టిడిపి నాయకులు మంగళవారం వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయిస్తూ బెదిరింపులకు పాల్పడుతోందన్నారు. ఎన్ని కుయుక్తులు పన్నినా వచ్చే ఎన్నికలలో వైసిపికి ఇంటికి సాగనంపడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కమతం కాటమయ్య, ఫణికుమార్, పురుషోత్తంగౌడ్, రాళ్లపల్లిషరీఫ్, అంబట్టి పనత్, గోసంశ్రీరాములు, దేశగాళ్లకేన కేతినేని రాజు, కొత్తపేట అది, బొట్టుకిష్ట తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : చంద్రబాబు నాయుడి అక్రమ అరెస్టు, పార్టీ శ్రేణులపై జరిగిన దమనకాండపై జగన్ రెడ్డి కక్షపూరిత చర్యలను మంగళవారం టీడీపీ జిల్లా అధ్యక్షులు బికె. పార్థసారథి ఖండించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జగన్ రెడ్డి అక్రమ కేసులకు భయపడేది లేదన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చేందుకు స్కిల్ డెవలప్మెంట్ ఏర్పాటు చేశారన్నారు. జగన్ రాజకీయ కక్షతోనే దాన్ని నిర్వీర్యం చేసి యువత ఉపాధి లేకుండా చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి, సర్పంచి శ్రీనివాసులు, సుబ్బరాయుడు, నాగరాజు, ప్రసాద్, ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా మండలంలోని పొడరాళ్లపల్లి, రామస్వామి తండా, నల్ల చెర్లోపల్లి, పూజారి తండాలో మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ అభిమానులు గ్రామస్తులతో సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్ర, రాఘవ, రామ్మోహన్, రమణయ్య, జయబాయ్, రామచంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని కోవెలగుట్టపల్లి వద్ద నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు కొత్తపల్లి జయప్రకాష్, నాయకులు అమ్మినేని కేశవనాయుడు, లింగప్ప, ఆంజనేయులు, పాపారెడ్డి, నాగేంద్ర, సుధాకర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : జగన్ కు రెండో ఛాన్స్ ఇస్తే రాష్ట్రం నాశనమే అవుతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వ కార్యదర్శి సవితమ్మ అన్నారు. మంగళవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఆరాచక పాలన సాగుతోందన్నారు. ఈ సమావేశంలో నాయకులు మాధవ నాయుడు, శ్రీరాములు, సూర్యనారాయణ, శెట్టినంజప్ప తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పర్వీన్ భాను స్థానిక టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : జగన్ రెడ్డి అక్రమ కేసులకు భయపడేది లేదని ప్రజాక్షేత్రంలో తేల్చుకుంటామని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఓటమి భయంతోనే సీఎం జగన్ వ్యవస్థలను అడ్డుపెట్టుకుని చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి రాజకీయ కక్ష సాధిస్తున్నారని ఆరోపించారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో ఆరోగ్యాంధ్రప్రదేశ్

ప్రజాశక్తి - ఓబుళదేవరచెరువు

ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందేలా అత్యాధునిక పరికరాలతో నిపుణులైన వైద్య సిబ్బందితో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రజలందరికీ ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారని ఎంపీడీవో వరలక్ష్మి తెలిపారు. మండలంలోని తుమ్మలకుంట్లపల్లి జడ్పీహెచ్ హైస్కూల్ ఆవరణంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భాను ప్రకాష్, ఆర్ఐ నాగేంద్ర, మండల కార్యదర్శి చంద్రమౌళి నాయుడు, సర్పంచి శ్రీదేవి, ఎంపీటీసీ ప్రభాకర్ నాయుడు, పంచాయతీ సెక్రటరీ నౌషాద్ తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : రాష్ట్ర ప్రజలు ఆరోగ్య వంతులుగా ఉండాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని ఎంపీపీ బగ్గిరి త్రివేణిరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ జయరాంరెడ్డి, మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, ఎంపీడీవో సాయిమనోహర్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని దంపెట్ల గ్రామ సచివాలయం వద్ద దంపెట్ల సర్పంచి చల్లా కరుణాకర్ నాయుడు, గరిశలపల్లి సర్పంచి పద్మావతి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ వంశీకష్ణ, ఎంపీడీవో సాయి మనోహర్, ఈవోఆర్డీ దివాకర్, సిఎస్‌డిటి శారదతో పాటు నాయకులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెనుకొండ : నగర పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్మన్ ఫరూక్, వైస్ ఛైర్మన్ సునీల్, నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : ప్రజలకు చేరువగా మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతోనే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిందని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. మంగళవారం పురపాలక సంఘంలోని 20,22,23 వార్డులలో వైద్య శిబిరాలు నిర్వహించి వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, ఎంఇ వెంకటరమణ, కౌన్సిలర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మానసిక రోగులకు మెరుగైన వైద్యం అందించండి

ప్రజాశక్తి కదిరి టౌన్

మానసిక రోగుల పట్ల అప్రమత్తంగా ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ జయలక్ష్మి వైద్యులకు సూచించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకొని స్థానిక ఏరియా హాస్పిటల్‌లో మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి సీనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మి , అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి పి మీనాక్షి సుందరి హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ మానసిక రోగులకు ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకుని రావాలని సూచించారు. ఈ సదస్సులో ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, సీనియర్ న్యాయవాది నరసింహులు , హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : పట్టణంలోని కొత్తపేటలో మానసిక వికలాంగుల కేంద్రాన్ని సీనియర్ సివిల్ జడ్జి ఎం.శంకర్ రావు మంగళవారం సందర్శించారు. ఆయనతో పాటు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డి.నాగరాజు తదితరులు మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ అధ్వర్యంలో పిల్లల యోగ క్షేమాలు తెలుసుకుని స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి ఎం. శంకర్ రావు మాట్లాడుతూ మానసిక వికలాంగులలో కూడా ఆత్మస్థైర్యం మానసిక పరివర్తన ఉంటాయని అన్నారు. అంగవైకల్యం జయించడానికి విశేషంగా కషి చేస్తున్న ఉపాధ్యాయులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మోహన్ నాయక్, శ్రీనివాసులు, శ్రీరాములు , కోర్టు సిబ్బంది శారదమ్మ, గోపాల్ రెడ్డి, మూర్తి, ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హిందూపురం : చెడు అలవాట్లకు బానిసలైన వ్యక్తులు మార్పు ద్వారా మెరుగైన జీవనశైలిని అలవర్చుకోవచ్చని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ, అదనపు మెజిస్ట్రేట్ రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వాసుపత్రిలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయమూర్తులు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ రోహిల్, వైద్యులు రాజగోపాల్, రుక్మిణమ్మ, ఎపిపి ఇందాద్, న్యాయవాదులు సుదర్శన్, నవేరా, అంజినమ్మ, హేమావతి పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : మానవజన్మ అందరికీ సమానమేనని, స్వేచ్ఛ, ఆత్మగౌరవం, హక్కులు కూడా అందరికీ సమానంగా ఉండాలని స్పందన హాస్పిటల్ అధినేత డాక్టర్ బషీర్ పేర్కొన్నారు. మానసిక ఆరోగ్య దినోత్సవ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక వ్యాధులతో బాధపడే వారి పట్ల వివక్ష, నూన్యతా భావన, చులకన ధోరణి, అవమానకర హేళన, హింసాత్మక ప్రవర్తన ఉండరాదన్నారు. ఆప్యాయత ఐక్యత భావన పొందలేక ఆనందంగా జీవించడానికి అవరోధాలు కూడా కలుగుతున్నాయని తెలిపారు. మానసిక రోగుల పట్ల తల్లిదండ్రులతో పాటు ప్రతి ఒక్కరూ ప్రేమ, అభిమానం, ఆప్యాయతో ఉండాలని సూచించారు. మానసిక జబ్బులు ఉన్నవారు బాధపడకుండా, తప్పనిసరిగా వైద్యుల వద్ద తగిన వైద్య సహాయం పొంది ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకొని మంచి జీవితాన్ని గడపాలని కోరారు.

ధర్మవరం టౌన్ : సమాజంలో ప్రతి ఒక్కరిని అప్యాయంగా ప్రేమగా పలుకరించాలని జూనియర్ సివిల్ జడ్జి శివపార్వతి పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవపురంలోని భవిత కేంద్రంలో మానసిక ఆరోగ్య దినోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జూనియర్ సివిల్ జడ్జి శివపార్వతి, గోపాల్నాయక్, డాక్టర్ చంద్రిక పాల్గొన్నారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ బుద్ధిమాంద్య పిల్లలను ప్రేమగా అదరించి వారికి మంచి జీవితాన్ని ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో లాయర్లు బాల సుందరి, బిల్లే రవీంద్ర, భవిత స్కూల్ టీచర్లు రమాదేవి, తిప్పేస్వామి పాల్గొన్నారు.